క్లుప్తంగా

చిత్తడి దారితో అవస్థలు



బురదమయంగా తయారైన తారురోడ్డు

గూడెంకొత్తవీధి: అద్దంలా తారు రోడ్డు కేబుల్ లైన్ ఏర్పాటు కోసం తవ్విన గోతుల కారణంగా బురదమయంగా తయారైంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని అద్దర వీధి నుంచి కంపుమానుపాకలు వరకు సెల్ టవర్ ఏర్పాటుకు కేబుల్ లైన్‌ల కోసం ఇటీవల అర కిలోమీటరు వరకు రోడుకు ఇరువైపులా గోతులు తవ్వారు. అప్పటి వరకు అద్దంలా ఉన్న తారురోడ్డు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మట్టి రోడ్డుపై పేరుకుపోయి బురదమయంగా తయారైంది. వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థ పడుతున్నారు. ఇప్పటికైనా జియో సెల్ టవర్ నిర్వాహకులు మట్టిని తొలగించి, సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పనులు పరిశీలన



వంకబూసి గ్రామంలో రోడ్డును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ సచివాలయం పరిధిలోని వంకబూసి గ్రామంలో సుమారు రూ.5లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆదివారం ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు కోరిన విధంగా సీసీరోడ్లను జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వాటిని నాణ్యతతో నిర్మించుకుని సద్వినియోగం చేసుకోమని గ్రామ పెద్దలకు సూచించారు. నాయకులు మంచినీళ్ళ నారాయణరావు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ పనసబంద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన హెచ్ఎం కంఠంనాయుడు, ఉపాధ్యాయురాలు ఎస్.సత్యవతికి బదిలీ కావడంతో శనివారం పనసబంద గ్రామంలో స్థానికులు వారిని ఘనంగా సన్మానించారు. వారి సేవలను పలువురు కొనియాడారు. గ్రామపెద్దలు సూరిబాబు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

హుకుంపేట: మండలంలోని బూరమసి పంచాయతీ నీలంపుట్టులో శనివారం జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సందర్శించారు. సర్పంచ్ బెటకారి పుష్పలమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని, ఆమెను కలిసి, పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెకు మరో ధైర్యం చెప్పారు. నాయకులు చిన్నయ్య, మత్స్యరాజు, సురేష్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా మండలంలోని వేటమామిడి నుంచి దుశ్చర్తి, రోళ్లగడ్డ, ధాన్యంపాలెం, రాయపల్లి పరిసర గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ యూసఫ్ తెలిపారు. 11 కెవి లైన్ మరమ్మత్తులు, చెట్లు కొమ్మలు తొలగించే పనుల నిమిత్తం ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా అమ్మవారి పండగ

దేవరాపల్లి: పసలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయం ఎదురుగా అమ్మవారికి ప్రతిరూపంగా కొలిచే వేప చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఏటా ఈ సీజన్‌లో పాడి పంటలు సమృద్ధిగా పండాలని పలసమ్మ తల్లికి పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించుకుంటారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు మహర్దశ



అనంతగిరి ప్రభుత్వ కళాశాలలో జరగనున్న అభివృద్ధి పనులు

- నాడు–నేడులో రూ.60 లక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అనంతగిరి: గతంలోని సమస్యలతో స్వాగతం పలికిన కళాశాల.. మరికొద్ది నెలల్లో అభివృద్ధితో స్వాగతం పలికేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు నిదర్శనం.. మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలే.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు రెండో విడతలో రూ.60 లక్షలతో కళాశాలలో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. గతంలోని పలు సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కళాశాలలో అదనపు సదుపాయాలు, మౌలిక వసతులు చేకూర్చుతుండడంతో విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు వంద మంది కొత్తగా 50 అడ్మిషన్లు జరిగాయి. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి, 170 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయి.

నాడు నేడులో జరుగుతున్న కళాశాల పనులు:

- మరుగుదొడ్లు నిర్మాణంలో ఉన్నాయి.
- తరగతి గదులను సుందరంగా తీర్చిదిద్దారు.
- తాగునీరు కోసం బోరు వేయించారు.
- ఆర్‌వో ప్లాంట్ కోసం ప్రతిపాదనలు పంపించారు.
- పెయింటింగ్, గ్రీన్ చాక్‌బోర్డు, ప్రహరీ, ఫర్నీచర్ తదితర పనులు జరగాల్సి ఉంది.

అడ్మిషన్లు పెరిగాయి

నాడు–నేడుతో కళాశాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు అవకాశం కలిగింది. విద్యార్థులను ఆకర్షించేలా పనులు జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే అడ్మిషన్లు పెరుగుతున్నాయి. నాడు–నేడు పనులు పూర్తయ్యితే విద్యార్థులకు మరింత మేలు జరుగుతుంది. కళాశాలలో పేరొందిన అధ్యాపకులతో ఉత్తమ బోధన జరుగుతోంది. మెరుగైన సదుపాయాలున్నాయి. ఉన్నత ఫలితాలు వస్తున్నాయి.

– సునంద, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతగిరి

సమస్యలు తీరేనా?

- అనంతగిరిలో నిరుపయోగంగా షెడ్లు
- డముకులో అసంపూర్తిగా నిర్మాణం
- వ్యాపారుల అవస్థలు



అనంతగిరిలో వినియోగంలోని లేని సంతషెడ్లు



డముకు వారపు సంతలో అసంపూర్తిగా ఉన్న సంతషెడ్లు

అనంతగిరి: మండలంలోని ప్రధాన వారపు సంతల్లో అసౌకర్యాలతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల సంతషెడ్లు లేకపోగా, మరికొన్ని నిరుపయోగంగా మారాయి. అందుకు నిదర్శనం అనంతగిరి మండల కేంద్రం వారపు సంతలో గతంలోని నిర్మించిన సంత షెడ్లు. అనంతగిరి, డముకు, కాశీపట్నం వారపు సంతల్లో గతంలోని వ్యాపారులు సౌకర్యార్థం సంత షెడ్లను నిర్మించారు. అయితే డముకు, కాశీపట్నంలోని సంతషెడ్లు వినియోగంలో ఉన్న అనంతగిరిలో మాత్రం వినియోగం లేవు.. డముకు, కాశీపట్నం పెద్ద సంతలు కావడంతో పెద్ద ఎత్తున వ్యాపారాలు జరుగుతాయి. అయితే అ రెండు సంతల్లో సంతషెడ్లు చాలకపోవడం అరకు–విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని వ్యాపారులు, తాత్కాలికంగా పాకలను ఏర్పాటుచేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. మరికొంత మంది ఎండల్లోనే వ్యాపారులు చేస్తున్నారు. అనంతగిరిలో సంతషెడ్లు ఉన్న నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి.

మొండిగోడలకే పరిమితం

గతంలోని వ్యాపారులకు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని, డముకు వారపు సంతల్లో పంచాయతీ ఆధ్వర్యంలోని సంతషెడ్లు నిర్మాణం చేపట్టారు. గోడలు వరకు నిర్మించి, అసంపూర్తిగా వదిలేశారు. నిర్మాణంపై నేటికి దృష్టి సారించకపోవడంతో మొండి గోడలతోనే దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యాపారాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు చేపడతాం



వారపు సంతలో ప్రధాన సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. అనంతగిరిలో నిరుపయోగంగా ఉన్న షెడ్లను వ్యాపారులకు అవగాహన కల్పించాలని, వినియోగంలోని తెచ్చేవిధంగా చర్యలు చేపడతాం.

ఎ.వి.వి.కుమార్, ఎంపీడీవో, అనంతగిరి

గెడ్డపీతల అమ్మకాల జోరు



పెద్దసైజులో పట్టిన పీతలను చూపిస్తున్న ఏడుకొండలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న గెడ్డ పీతలు

సాక్షి,పాడేరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గిరిజనులు గెడ్డ పీతల వేటలో నిమగ్నమయ్యారు. మంచి రుచికరంగా ఉండే గెడ్డ పీతలను పట్టి గిరిజనులు ఈ సీజన్‌లో ఇంటిల్లాపాది తింటారు. గ్రామాల్లో గిరిజనులంతా బృందాలుగా ఏర్పడి ఉదయం నుంచి సాయంత్రం వరకు గెడ్డలలో పీతలను వేటాడి వాటిని సమానంగా పంచుకుని వండుకు తినే ఆచారం ఉంది. అయితే ఈ గెడ్డ పీతలకు అన్ని వర్గాల ప్రజలు అలవాటుపడ్డారు. పాడేరుకు చెందిన కొంతమంది గిరిజనులు డి.గొందూరు, లగిశపల్లి, వంజంగి పంచాయతీల పరిధిలో గెడ్డపీతలను సేకరించి వాటిని ఉదయం, సాయంత్రం వేళల్లో పాడేరు పాతబస్టాండ్ కేంద్రంగా అమ్మకాలు జరుపుతున్నారు. ఆదివారం కూడా భారీగానే గెడ్డ పీతల వ్యాపారం జరిగింది. సైజును బట్టి పీతను రూ.15నుంచి రూ.20ధరతో అమ్మకాలు జరుగుతున్నాయి. గెడ్డపీతల వంటకాలకు పాడేరు వాసులు ఆసక్తి చూపుతున్నారు.

అంగవాడీల సమస్యలు పరిష్కరించాలి



జీపు జాతాలో పాల్గొన్న నాయకులు

రాజవొమ్మంగి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసూ ఆ యూనియన్ నాయకులు చేపట్టిన జీపుజాతా ఆదివారం రాజవొమ్మంగిలో ప్రారంభం అయ్యింది. రంపచోడవరం డివిజన్ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నిర్మల, సీఐటీయూ జిల్లా నాయకులు రామరాజు నేతృత్వం వహించారు. 27వ తేదీ నాటికి ఈ జీప్‌జాతా రంపచోడవరం చేరుతుందన్నారు.

ఘాట్‌రోడ్డులో నేలకూలిన భారీ వృక్షం



రోడ్డుపై పడిన చెట్లును పోలీసుల సాయంతో తొలగిస్తున్న వ్యక్తులు

కొయ్యూరు: చింతాలమ్మ ఘాట్‌రోడ్డులో ఆదివారం ఉదయం భారీ వృక్షం నేలకూలింది. ఇది రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న కొయ్యూరు సీఐ స్వామి నాయుడు ,ఎస్ఐ రాజారావు వెంటనే స్పందించారు. సమీపంలో జాతీయ రహదారి పనులు చేస్తున్న జేసీబీ తీసుకొచ్చి గంటపాటు శ్రమించి చెట్టును తొలగించారు. దీంతో రాకపోకలు యధావిధిగా సాగాయి. మండలంలోని పిట్టాచలం, కాకరపాడు సమీపంలో ఇటీవల పెద్ద చెట్లు ఈదురు గాలులకు నెలకొరిగాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. అయితే కొయ్యూరు పోలీసులు వెంటనే స్పందించి వాటిని తొలగిస్తున్నారు. ఇలా అత్యవసర సమయంలో పోలీసులు స్పందించడంపై స్థానికులు వారి సేవలను ప్రసంశిస్తున్నారు.

జగనన్న సురక్షపై గ్రామాల్లో ఇంటింటా సర్వే



తోటకూరపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్వహిస్తున్న సర్వే

వై.రామవరం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ వలంటీర్లు జోరుగా సర్వేలు నిర్వహించారు. గ్రామ వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్‌లు, సచివాలయ సిబ్బంది, పాల్గొని ఆయా కుటుంబాల వివరాలు, అందిన పథకాలు, వారి సమస్యలు, అదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవంతంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పూర్తి చేయడం కోసం గ్రామ వలంటీర్లు సైనికుల్లా పనిచేస్తు వేగవంతంగా సర్వేను నిర్వహిస్తున్నారు.

హుకుంపేట: మండలంలోని బాకురు పంచాయతీ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సొసైటీ బ్యాంకు చైర్మెన్ కె.రామకృష్ణ, ఎంఎల్‌వో శివరామ్, నాయకులు బాకురు సదాశివరాజు పాల్గొన్నారు. ఈ సందర్బంగా జగనన్న సురక్షపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సూకురు, హుకుంపేట పంచాయతీ కేంద్రాల్లో సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, దనసాని సత్యవతి పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆశాజ్యోతి ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో వలంటీర్లు జగనన్న సురక్షపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి సంబంధిత ధువపత్రాలను ఉచితంగా సకాలంలో అందజేయాలని సూచించారు.

అరకులోయ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ తెలిపారు. పెదలబుడు పంచాయతీ ఆర్.డుంబ్రిగుడ గ్రామంలో ఆదివారం మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమలు విజయవంతంగా చేపట్టాలన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. వైస్ ఎంపీపీ రామన్న, మాజీ వైస్ సర్పంచ్ కిల్లో సత్యనందం, నాయకులు వెంకటరావు, ఆనంద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

4న విజయవాడలో మహాధర్నా



రామవరంలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

వీఆర్ పురం: విజయవాడలో జూలై4 వతేదీన నిర్వహించనున్న మహా ధర్నాకు పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులు అధిక సంఖ్యలో తరలిరావాలని సీపీఎం ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోలవరం పోరు కేక పేరుతో సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20న నెల్లిపాకలో ప్రారంభమైన పాదయాత్ర చింతూరు మండలం మీదుగా కొనసాగుతూ ఆదివారం వీఆర్ పురం మండలంలో ప్రవేశించింది. ఈ సందర్బంగా సున్నంవారిగుడెం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. నిర్వాసితుల పోరాటానికి ఎమ్మెల్సీల పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అనంతరం పాదయాత్ర చినమట్టపల్లి, పెదమట్టపల్లి గ్రామాల మీదుగా రేఖపల్లి చేరుకొంది. నాయకులు అరుణ్‌కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ముంచంగిపుట్టు: అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, జిల్లా కార్యదర్శి హేమవతి సమక్షంలో స్థానిక కల్యాణ మండపంలో ఎన్నిక జరిగింది. మండల నూతన కమిటీ అధ్యక్షురాలుగా సానియా ఈశ్వరి, కార్యదర్శి సిసా విజయ, సభ్యులుగా మీనా, రాధమ్మ, దసుధ, లలిత, కుమారి, దేవిలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మహిళ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరి, విజయలు మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సామగ్రి పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: పాడేరు పట్టణంలో వాసవి హిల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రతినిధి రామనాథ రమేష్ పాడేరు చేరుకుని మోదకొండమ్మతల్లిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు సేదతీరేందుకు ఏర్పాటుచేసిన సిమెంట్ బల్లలను ప్రారంభించారు. గ్రీన్ మ్యాట్ పంపిణీ చేశారు. పేద ఆర్యవైశ్యులకు నిత్యావసర సామగ్రి, చీరలు, దుస్తులు, పలు చేతి వృత్తిదారులకు పరికరాలను పంపిణీ చేశారు. వాసవి హిల్స్ క్లబ్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రతినిధులు శ్రీనాథ్ శ్రీను, శ్రీనాథ్ శ్రీనివాసరావు, పుట్టా నానాజీ, సంతోష్, రమేష్, అప్పారావు, గౌతమి, శ్రావణి పాల్గొన్నారు.

నేడు లోదొడ్డిలో 'గడప గడపకు'

రాజవొమ్మంగి: లోదొడ్డి పంచాయతీలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ హాజరవుతున్నట్టు చెప్పారు.

విద్యుత్ కోతతో అవస్థలు

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీలో లక్కపాడు, పెదవలస. కుమ్మరిగుంట, వంట్లమామిడి, తియ్యమామిడి కర్జపల్లి, పార్లు, పాచెలి గ్రామాల్లో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది . దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ సర్పంచ్ కొండబాబుతో పాటు పలువురు చెబుతున్నారు. ఆయా గ్రామాల్లో కరెంట్ లేకపోవటంతో రాత్రిళ్లు రాకపోకలు సాగించటానికి భయపడాల్సి వస్తుందంటున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లైన్‌మెన్ ఎల్లయ్య మాట్లాడుతూ రేపటి లోగా లైన్ పనులు పూర్తిచేసి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

వర్షాలతో రైతుల్లో హర్షం

- సమృద్ధిగా సాగునీరు



పొలంలో వర్షపునీరు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసర ప్రాంతాల్లో గత ఐదు రోజులుగా దాదాపు ప్రతి రోజు వర్షం కురుస్తోంది. దీంతో పొలాల్లో వర్షపు నీరు చేరింది. సాధారణంగా జూన్ రెండవ వారంలోనే (మృగశిర కార్తెలో) వరి నారుమడులు వేస్తారు. అనుకున్న సమయంలోగా వర్షాలు కురవక రైతులు కొంత ఆందోళన చెందారు. అయితే గత ఐదు, ఆరు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో సాగునీటికి ఇబ్బంది లేకుండా పోయింది. రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో పాటు ప్రభుత్వం ముందస్తుగానే విత్తనాలు పంపిణీ చేసింది. రైతులు దుక్కి పనులతో పాటు విత్తనాలు జల్లే పనులు చేపడుతున్నారు. మండలంలో ఇప్పటికే 90 శాతం రాయితీపై వెయ్యి క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. మండలంలో కొన్ని చోట్ల నారుమడులు సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా అన్ని చోట్ల ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

సచివాలయ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

సాక్షి,పాడేరు: పాడేరు డివిజన్ పరిధిలోని సచివాలయాల ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది.సెలవు దినాల్లో మాత్రమే క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. టోర్నీలో 12 క్రీడా జట్లు పాల్గొన్నాయి. తొలిరోజు రెండు మ్యాచ్‌లను నిర్వహించారు. హుకుంపేట సచివాలయం జట్టుపై చింతపల్లి జట్టు, అరకులోయ సచివాలయం జట్టుపై ముంచంగిపుట్టు జట్టు విజయం సాధించింది. మరలా ఈనెల 29, జూలై 6న మ్యాచ్‌లు జరుగుతాయని టోర్నమెంట్ నిర్వాహక ప్రతినిధి జి.కోటిబాబు తెలిపారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు ఆదివారం కావడంతో అనకాపల్లితో పాటు విశాఖ, విజయనగరం జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసుకుని అమ్మవారికి నివేదించి కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందజేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.